

మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

ఉపాధ్యాయ ఐక్యవేదిక సంఘాల డిమాండ్

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదికతో ఇటీవల జరిగిన చర్చల్లో ఎస్‌జిటి ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించడానికి ప్రభుత్వం అంగీకరించిందని, ఇప్పుడు మాట మార్చి వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించడానికి నిర్ణయించడం దుర్మార్గమైన, హేయమైన చర్య అని ఐక్యవేదిక సంఘాల ఉపాధ్యాయులు ప్రభుత్వ తీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ఎంఆర్‌సి వద్ద శనివారం ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఆర్థికపరమైన అంశాల్లో ప్రభుత్వం ఎటువంటి మేలు ఇప్పటి వరకు చేయలేదన్నారు. ఇప్పుడు ఉపాధ్యాయులకు తీరని నష్టాన్ని చేకూర్చేలా చర్యలు ఉన్నాయని అన్నారు. ఈ బదిలీలు ఆర్థికేతర అంశాలకు చెందినవని, అదేవిధంగా మాన్యువల్ కౌన్సెలింగ్ కూడా ప్రభుత్వం నిర్వహించలేని నిస్సహాయస్థితిలో ఉండడం శోచనీయమని అన్నారు. సరైన సౌకర్యాలు లేని కారణంగా మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించలేమని చెప్పడం ప్రభుత్వం చేతకానితనానికి ఇది ఒక నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకొని ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించనట్లయితే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఆదివారం డిఇఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, ఉవ్వెత్తున ఉపాధ్యాయు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.వి.టి.భాస్కరరావు, బొడ్డేపల్లి గోపీచంద్, తమ్మినేని సీతారాం, కింతలి చంద్రరావు, నూక అప్పలనాయుడు, మెండ శ్యామలరావు, వివిధ సంఘాల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



కోటబొమ్మాళి : నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కోటబొమ్మాళి: ఎంఇఒ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయ ఐక్య వేదిక ప్రతినిధులు గొండు నారాయణరావు, సీపాన త్రినాథరావు, ఆనందరావులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐక్య వేదిక ప్రతినిధులు గోవిందరావు, మన్మథ, సంజీవరావు, కమలాభాయ్, సింహాచలం, వెంకటరావు, వైకుంఠరావు, ఆధినారాయణ, చంద్రమోహన్ పాల్గొన్నారు.

రణస్థలం: స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయ ఐక్యవేదిక ప్రతినిధులు డి.కోటేశ్వరరావు, టి.శంకరరావు, బి.అప్పలనాయుడు, ఎస్.కోటేశ్వరరావు, జి.ఆదినారాయణ, జె.వెంకటేశ్వరి, జి.చిన్నికృష్ణనాయుడు, కె.శ్రీధర్, వై.శ్రీను, బి.చిన్నంనాయుడు, సిఐటియు నాయకులు సిహెచ్.అమ్మానాయుడు పాల్గొన్నారు. అనంతరం ఎంఇఒ-2 బి.లావణ్యకు వినతిపత్రం అందజేశారు.



రణస్థలం : వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు



ఆమదాలవలస : నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కేశవరావు ఎన్‌కౌంటర్ మోడీ ఫాసిస్టు వైఖరికి నిదర్శనం

సంస్మరణ సభలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రసాద్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ మోడీ ఫాసిస్టు వైఖరికి నిదర్శనమని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్ అన్నారు. గుండెకోట ఎన్‌కౌంటర్‌లో అమరుడైన మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు సంస్మరణ సభ శనివారం నగరంలోని క్రాంతి భవన్‌లో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అధ్యక్షతన వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యాన నిర్వహించారు. ముందుగా కేశవరావు చిత్రపటానికి అమర వీరుల బంధు మిత్ర సంఘం నాయకులు జోగి కోదండం పూలమాల వేసి సభలో మౌనం పాటించింది. వేదిక పైకి వక్తలను సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రసాద్ మాట్లాడుతూ నంబాల కేశవరావును మోడీ ఫాసిస్టు ప్రభుత్వం హత్య చేసిందన్నారు. మృతదేహాన్ని, అస్తికలు, చితాభస్మం కుటుంబ సభ్యులకు ఇవ్వకపోవడం అభద్రతనూ, భయభీతులను వెల్లడి చేస్తోందన్నారు. తాను హిందూ మత పక్షపాతిగా చెప్పుకునే మోడీ సర్కార్ హిందూధర్మం ప్రకారం కర్మకాండ చేసుకునే వీలు కూడా ఆ కుటుంబానికి లేకుండా చేయడం హిందూ మతంపై వాళ్లకు కపట ప్రేమను వెల్లడిస్తోందన్నారు. కేశవరావు, సుధాకర్ వంటి విప్లవ యోధులను భౌతికంగా చంపిన మోడీ సర్కార్ విప్లవ రాజకీయ శక్తులను నిర్మూలించినట్లు మురిసిపోవడం భ్రమగా మిగలక తప్పదన్నారు. మృతదేహం, బూడిద లేకుండా కేవలం కేశవరావు ఫొటో పెట్టుకొని పెద్దకర్మ నిర్వహించే అవకాశం కూడా లేకుండా చేసిన మోడీ, బాబు సర్కార్ల చర్య సమాజాన్ని చలింపజేసిందన్నారు. ఈ ప్రభుత్వాల లక్ష్యం మన దేశ సంపదను సామ్రాజ్యవాదులు, కార్పొరేట్ కంపెనీలకు, బహుళజాతి సంస్థలకు అప్పగించడమన్నారు. ఈ దేశం సంపదలను కాపాడుకోవడానికి కమ్యూనిస్టు విప్లవకార్లు పోరాడుతున్నారని అన్నారు. వారిని తుదిముట్టించే లక్ష్యంతో ఆపరేషన్ కగార్ హత్యాకాండకు దిగిందని అన్నారు. అనచివేతతో కమ్యూ నిజాన్ని ఆపడం సాధ్యం కాదన్నారు. కేశవరావు, సుధాకర్ వంటి విప్లవకార్ల అమర స్మృతిలో కొత్త విప్లవ శక్తుల జననం రేపటి నిజమని అన్నారు. ఈ అమరత్వం నేటి మన తరానికి మిగిల్చే దు్ణఖం యువతరాన్ని కమ్యూనిజానికి అనుసంధా నిస్తుందని అన్నారు. మోడీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాల్ని, కార్పొరేట్లని ప్రతిఘటించడానికి వామపక్ష పార్టీలు, ప్రజాతంత్ర వాదులు, ప్రజలు సంఘటిత పడతారని అన్నారు. ఈ సభలో సిపిఐ పార్టీ నుంచి తిరుపతిరావు, సిపిఐ నుంచి కె.మోహనరావు, సిపిఐ (ఎంఎల్) నుంచి తాండ్ర అరుణ మాట్లాడుతూ తాము వేర్వేరు రాజకీయ పార్టీలకి చెందినా మోడీ సర్కార్ హత్యాకాండకు వ్యతిరేకంగా ఐక్యంగా నిలబడతామనన్నారు. భౌతికంగా ఈ సభకు హాజరుకాలేక పోయినా తమ భాగస్వామ్యం ఉన్నట్లు భావించాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్, సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా నాయకులు సందేశాలు పంపారు. కార్యక్రమంలో అమరవీరుల బంధు మిత్రుల సంఘం రాష్ట్ర నాయుకులు జోగి కోదండం, సిఎల్‌సి జిల్లా అధ్యక్షులు పత్రి దానేసు, సామ్నా రాష్ట్ర నాయుకుడు నల్లి ధర్మారావు, దాసరి శ్రీరాములు తదితరులు మాట్లాడారు. ప్రజా కళాకారులు, అరుణోదయ కళాకార్లు పాడిన పాటలు రక్తి ఆకట్టుకున్నాయి, ఆలోసింపజేశాయి.



సంస్మరణ సభలో మాట్లాడుతున్న ప్రసాద్

నంబాళ్ల కుటుంబాన్ని పరామర్శ

కోటబొమ్మాళి : ఎన్‌కౌంటర్‌లో హత్యకు గురైన మండలంలోని జియన్నపేటకు చెందిన నంబాల కేశవరావు కుటుంబ సభ్యులను న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్, జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సహాయ కార్యదర్శి వంకల మాధవరావులు పరామర్శించారు. ముందుగా కేశవరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

జిల్లాలో భారీ వర్షం

ప్రజాశక్తి- జిల్లా విలేకరుల యంత్రాంగం

జిల్లాలో పాతపట్నం, మెళియాపుట్టి, ఆమదాలవలస, బూర్జ మండలాల్లో శనివారం వర్షం కురిసింది. పగటి పూట అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదై ఎండ వేడిమికి ప్రజలు తట్టుకోలేక ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారి మేఘాలు కమ్ముకుని కొద్ది నిమిషాల్లోనే భారీ వర్షం కురిసింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్లపై భారీగా నీరు చేరి పలు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. పట్టణంలోని వెంగళరావు కాలనీ, పూజారిపేట, కంద్రపేట, మెట్టక్కివలస వంటి ప్రాంతాల్లో రహదారులపై కాలువల్లోని మురుగునీరు నీరు ప్రవహించింది. కార్యాలయాల నుంచి ఇంటికి చేరుకునే ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగులు ఇంటికి చేరుకోవడానికి ఇబ్బందులు పడ్డాడు. దీంతో వాతావరణం చల్లబడింది. రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మెళియాపుట్టి మండలం టెక్కలి- మెళియాపుట్టి రోడ్డులో పోలూరు వద్ద ఆర్అండ్‌బి రోడ్డుపై ఈదురు గాలులు, వర్షానికి చెట్టు నేలకొరిగింది. దీంతో వాహనాల రాకపోకలకు అసౌకర్యం ఏర్పడింది. స్థానికులు స్పందించి చెట్టు కొమ్మలను తొలగించారు. సిరియాకండిలో విద్యుత్ స్తంభం నేలకొరగడంతో గొర్రెలు మృతి చెందాయి. గొర్రెల కాపరి ఎస్.అప్పన్న కాలు విరిగిపోయింది.



మెళియాపుట్టి : విద్యుత్ స్తంభం పడి మృతి చెందిన గొర్రె

బస్టేషన్లలో లీజుకు ఖాళీ స్థలాలు

శ్రీకాకుళం సిటీ: ప్రజా రవాణా సంస్థ విజయనగరం జోన్ పరిధిలోని శ్రీకాకుళం జిల్లాలో వివిధ బస్‌స్టేషన్లలో ఆరు ఖాళీ స్థలాలను, 15 ఏళ్లకు లీజుకు ఇచ్చే ప్రాతిపదికన టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో ఇచ్ఛాపురం బిట్-3, 1,113 చదరపు గజాలు, టెక్కలి బిట్-1, 5378 చదరపు గజాలు, బిట్-2, 5378 చదరపు గజాలు, ఆమదాలవలస పాత బస్‌స్టేషన్‌లో బిట్-1, 3750 చదరపు గజాలు, బిట్-2, 3750 చదరపు గజాలు, ఎచ్చెర్లలో బిట్-1, 1162 చదరపు గజాల ఖాళీ స్థలాలు లీజుకు ఇస్తామన్నారు. ఈ ఖాళీ స్థలాల వివరాలపై ఈ నెల 10న ఉదయం 11 గంటలకు శ్రీకాకుళం బస్ స్టేషన్‌లో రెండో అంతస్తులో గల డ్రైవర్ల శిక్షణా కళాశాల్లో ప్రీ బిడ్డర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టెండర్ డాక్యుమెంట్లు, స్థలాల వివరాలు వాటికి సంబంధించిన డ్రాయింగ్ ఆర్‌టిసి వెబ్ సైట్‌లో పొందుపర్చినట్టు తెలిపారు. బిడ్ సంబంధిత డాక్యుమెంట్లు ఈ నెల 17న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆఫ్‌లైన్‌లో సమర్పించ వచ్చునని చెప్పారు. అర్హత కల్గిన బిడ్లు అదే రోజు మధ్యాహ్నం మధ్యాహ్నం 3 గంటలకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయం, జోనల్ వర్క్‌షాప్, టివి అగ్రహారం, విజయనగరం వద్ద ఖరారు చేస్తామన్నారు. ఔత్సాహిక వ్యాపా ‍వేత్తలు టెండరులో పాల్గొని ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 93 46045369 నంబరును సంప్రదించాలన్నారు.

శాలిహుండంలో యోగా వైభవం

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- గార

ఈ నెల 21న విశాఖపట్నంలో ప్రధానమంత్రి మోదీ నేతృత్వంలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ముందు రాష్ట్రవ్యాప్తంగా యోగా ఉత్సవాలు ఊపందుకున్నాయని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మండలంలోని చారిత్రక బౌద్ధ క్షేత్రం శాలిహుండంలో శనివారం నిర్వహించిన యోగాసనాల అభ్యాసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజూ యోగాసనాలు వేయడం దినచర్యలో భాగం చేసుకుంటే శారీరక మానసిక ఆరోగ్యం కలుగుతుందని అన్నారు. శాలిహుండం వంటి రెండో శతాబ్దం కాలం నాటి బౌద్ధక్షేత్రంలో ప్రశాంత వాతావరణంలో యోగా చేయడం మంచి అనుభూతినిచ్చిందని పేర్కొన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో పనిచేస్తున్నాయి. జిల్లాలో నాలుగు చారిత్రక ప్రదేశాలలో యోగా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలని తల పెట్టామని చెప్పారు. త్వరలో కళింగపట్నంలో కూడా ఇంతే వైభవంగా చేస్తామన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ శాలిహుండం వంటి చారిత్రక ప్రదేశాల్లో ఇలాంటి ఆరోగ్యదాయక కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్లు జగదీష్, ఉత్తమ్ రాజ్‌రాణా, తంగి స్వాతి, కొంక్యాన మురళీధర్, యోగా గురువు మురళి, గాయత్రి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సురేంద్ర, కల్పన పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న కేంద్రమంత్రి, కలెక్టర్

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి- గార

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని విశాఖ ఎ కాలనీలో శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో గార, శ్రీకాకుళం రూరల్ మండలం, టౌన్ నుంచి పెద్ద ఎత్తున కార్యాలయానికి చేరుకొని వినతులను అందజేశారు. ప్రతి ఒక్కరి సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కారం మార్గం చూపిస్తామని ఎమ్మెల్యే హామీనిచ్చారు. కూటమి పాలనలో అందరికీ సమన్యాయం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా గత ఐదేళ్లలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడంతో పెద్ద ఎత్తున నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు అందుతున్నాయన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్యం, విద్యుత్, డ్రైన్లు, సాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి వినతులు అందుతున్నాయని, వాటిని పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కించే దిశగా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా నిర్వహిస్తున్నామని, గత 10 నెలల్లోనే ప్రజాప్రభుత్వంగా ప్రజలతో మన్ననలు అందుకున్నామని వివరించారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూలేని విధంగా రాష్ట్రంలో అన్ని తరగతుల అభివృద్ధికి, అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నామని వివరించారు. ఇళ్లు కావాలని పెద్ద ఎత్తున వినతులు అందుతున్నాయని రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి సమస్యను తీసుకెళ్లి ఒక ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

రాష్ట్రంలో విధ్వంస పాలన

మాజీ మంత్రి అప్పలరాజు

శ్రీకాకుళం సిటీ: రాష్ట్రంలో విధ్వంశ పాలన కొనసాగుతుంది, ఏడాదిలో కూటమి ప్రభుత్వం సాధించింది ఏమిటని మాజీ మంత్రి, వైసిపి డాక్టర్ల విభాగం అధ్యక్షులు సీదిరి అప్పలరాజు ప్రశ్నించారు. శ్రీకాకుళం పట్టణంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో దౌర్జన్యాలు, దోపిడీతో కూడిన రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని విమర్శించారు. బీహార్‌లో గతంలో, ప్రస్తుతం ఇటు పాలన లేదని అన్నారు. దేశంలో ప్రమాదకరమైన పాలన రాష్ట్రంలో ఉందన్నారు. ప్రశ్నించే గొంతు నొక్కుతున్నారని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. మేనిఫోస్టో అమలు చేయరా? అంటూ దుయ్యబట్టారు. సిఎం చంద్రబాబు నాయడు హామీలకు వెన్నుపోటు పొడుస్తున్నారని అన్నారు. 50 ఏళ్లు దాటిన బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు ఇస్తామన పింఛను ఎప్పుడు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. వికలాంగులు, వృద్ధులు పింఛన్లు కోసం నిరీక్షిస్తున్నారని అన్నారు. ఇంటింటికీ ఫించన్లు పంపిణీలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పోలీస్ వ్యవస్థను కక్ష సాధింపులకు వాడుకుంటున్నారని అన్నారు. రైతులను, నిరుద్యోగులను విస్మరించారన్నారు. పారిశ్రామిక వేత్తలను బెదిరిస్తున్నారని విమర్శించారు. రణస్థలంలో యుబి పరిశ్రమను బెదిరిస్తున్నారని ఆరోపించారు. దావోస్ వెళ్లి ముఖ్యమంత్రి ఎటువంటి ఎంఒయులు లేకుండా వచ్చారని అఅన్నారు. రాజకీయ కక్షలు, హత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీపం పథకం అమలులో విఫలమయ్యారన్నారు. నిరుద్యోగ భృతి, 20 లక్షలు ఉద్యోగాలు, తల్లికి వందనం ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలన్నారు.



మాట్లాడుతున్న అప్పలరాజు

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఇంటర్మీడియట్ విద్యార్థులకు నిర్వహించిన అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. మొదటి ఏడాదిలో 6406 మంది విద్యార్థులకు 6151 మంది విద్యార్థులు హాజరు కాగా, 2890 మంది ఉత్తీర్ణత సాధించారు. 46.98 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రెండో ఏదిలో 5835 మంది విద్యార్థులకు 5,525 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 3607 మంది ఉత్తీర్ణత సాధించారు. 65.29 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఒకేషనల్‌లో మొదటి ఏడాది 207 మంది పరీక్ష రాయగా, 127 మంది ఉత్తీర్ణత సాధించారు. 61.35 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రెండో ఏడాదిలో 244 మంది విద్యార్థులకు 187 మంది ఉత్తీర్ణత సాధించారు. 76.64 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

మహిళలకు రక్షణగా శక్తి యాప్



అవగాహన కల్పిస్తున్న శక్తి బృందం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

మహిళలకు రక్షణగా శక్తి మొబైల్ యాప్ ఉపయోగపడుతుందని శక్తి టీం పోలీసు సిబ్బంది విస్తృతంగా శక్తి యాప్ గురించి అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం మహిళలు భద్రత రక్షణ కోసం అందుబాటులోకి తీసుకువచ్చిన శక్తి యాప్ ఉపయోగం, సేవలు, నిక్షిప్తం, రిజిస్ట్రేషన్ గురించి జిల్లాలో మహిళలు, మహిళా ప్రయాణికులకు శక్తి బృందాలు శక్తి యాప్ ఆవశ్యకత, ప్రాధాన్యత, అందించే సేవలు, ఇతర ఇతర వివరాలు గురించి అవగాహన కల్పించారు. ఎస్‌పి ఆదేశాల మేరకు శ్రీకాకుళం, టెక్కలి, కాశీబుగ్గ పోలీసు సబ్ డివిజన్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో షాపింగ్ మాళ్ల వద్ద శక్తి టీమ్ సిబ్బంది శక్తి యాప్‌పై మహిళలకు శనివారం వివరించారు. ప్రతి మహిళా శక్తి యాప్ ఫోన్‌లో నిక్షిప్తం చేసుకుని రిజిస్ట్రేషన్ కావాలన్నారు. ఈ సందర్భంగా శక్తి యాప్ టీమ్ సిబ్బంది మాట్లాడుతూ మహిళలు అత్యవసర పరిస్థితుల్లో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా శక్తి అప్ ద్వారా 100,112 మరియు, బటన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. మహిళలకు ఆపద సమయంలో అత్యవసర సాయం అందించేందుకు శక్తి యాప్ ఒక అయధంగా పనిచేస్తుంది అన్నారు. మహిళలు, విద్యార్థులు మీ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

ఏం ఒరగబెట్టారని పండగ సంబరాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి



టిడిపి కూటమి ప్రభుత్వం ఘన విజయం సాధించి ఏడాది పూర్తయిన సందర్భంగా సంబరాలు నిర్వహించాలని జనసేన పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చింది. ఎన్నికలు ఫలితాలు వెలువడిన రోజైన జూన్ నాలుగో తేదీన దీపావళి, సంక్రాంతి ఒకే రోజున జరుపుకోవాలని శ్రేణులకు సూచించింది. జిల్లా కేంద్రంతో పాటు పలుచోట్ల వీరమహిళలు రంగవల్లులు వేసి, దీపాలు వెలిగించారు. టపాకాయలు కాల్చి ఆనందం పంచుకున్నారు. నేతలకు పదవులు వచ్చి సంవత్సరమైన నేపథ్యంలో వారిలో ఆ రకమైన ఆనందం వచ్చి ఉండొచ్చు గాని ఏడాది కాలంలో ప్రజలకు ఒనగూరిన మేలు మాత్రం ఏమీ లేదనే చెప్పాలి. ఎంతసేపు వృద్ధులకు ఫించన్ రూ.వెయ్యి పెంచామని, మహిళలకు ఉచితంగా మూడు సిలిండర్లు ఇస్తామని గొప్పలు చెప్పుకోవడం తప్ప ప్రజలకు ఆర్థికంగా పెద్దగా ప్రయోజనం కల్పించిందీ లేదు. చంద్రబాబు తన మనుషులకు, సంస్థలకు చేస్తున్న భూసంతర్పణతో పోలిస్తే ప్రజలకు ఇచ్చింది సముద్రంలో కాకి రెట్టంత అనే చెప్పాలి. అప్పటివరకు ప్రభుత్వం నుంచి ఏదో రకంగా ఆర్థిక ప్రయోజనాలు పొందిన పేదలు ఏడాది కాలంలో తామేమి కోల్పోయామో అర్థం చేసుకుంటున్నారు. వైసిపి ప్రభుత్వం కంటే రెట్టింపు సంక్షేమం అందిస్తామని ఎన్నికల ముందు హామీలిచ్చిన కూటమి నేతలు ఆనక అధికారంలోకి వచ్చిన తర్వాత స్వరం మారుస్తుండటాన్ని ప్రజలు గమనిస్తున్నారు. రాష్ట్రం అప్పుల్లో ఉందని, హామీలు చూస్తే భయమేస్తోందని చంద్రబాబు శాసనసభ తొలి సమావేశాల్లో చెప్పడంతోనే ప్రజలకు కొంత అర్థమైంది. సంక్షేమ పథకాలకు డబ్బులు ఎలా వస్తాయో తన చెవిలో చెప్తే వాటిని అమలు చేస్తానంటూ ఒకానొక బహిరంగ సభలో బాబు వెటకారంగా చెప్పడంతోనే ఇప్పట్లో సూపర్ సిక్స్ అమలు చేసే పరిస్థితి లేదని ప్రజలకు బోధ పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండో ఖరీఫ్ సీజన్ మొదలైనా అన్నదాత సుఖీభవా అమలు చేయడానికి చంద్రబాబుకు మనస్కరించడం లేదు. ఇదిగో అదిగో డబ్బులు ఇస్తామంటూ కూటమి ప్రభుత్వం సాగదీస్తోంది. తల్లికి వందనం పరిస్థితీ అంతే. యువగళం పాదయాత్రలో విద్యార్థులకు లోకేష్ ఇచ్చిన హామీల్లో ఒక్కటీ కూడా నెరవేర్చకపోవడంతో విద్యార్థుల్లోనూ తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఇజనరీ నేతగా ఘనకీర్తి వహించిన చంద్రబాబుకు ప్రజల నాడి తెలిసినా ప్రజలంతా సంతృప్తితోనే ఉన్నట్లు బాబు బిల్డప్ ఇస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ అమలు చేస్తూ రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నామంటూ బాబు కలరింగ్ ఇస్తున్నారు. అప్పుడప్పుడు వైసిపి విధ్వంసం, రాష్ట్రం అధోగతి పాలయిందంటూ గత స్మృతులను గుర్తు చేస్తూ ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని దృష్టిని మరలించేందుకు రకరకాల డైవర్షన్ పాలిటిక్స్ అస్త్రాలను వినియోగిస్తున్నారు.

టిడిపి కూటమి ప్రభుత్వం ప్రస్తుతం సంక్షేమ పథకాల జోలికి వెళ్లకుండా యోగా, స్వచ్ఛంద్రా పేరుతో శుభ్రత వంటి కార్యక్రమాలపై ఎక్కువ దృష్టి పెట్టినట్లుగా కనిపిస్తోంది. అందులో భాగంగా ఆంధ్రాకు ముందు రకరకాల ట్యాగ్ లైన్స్ చేర్చడం ఫ్యాషన్‌గా మారిపోయింది. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర, హరితాంధ్ర, యోగాంధ్ర ఇలా రకరకాల పేర్లతో ఇటీవల వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహిస్తుండటం చూశాం. 2014-19 టిడిపి హయాంలో చంద్రన్న వైద్య సేవ, చంద్రన్న సంక్రాంతి కానుక, చంద్రన్న రంజాన్ తోఫా, చంద్రన్న భీమా ఇలా ప్రతి పథకానికీ చంద్రబాబు పేరు చేర్చి అమలు చేసేవారు. బహుశా సంక్షేమ పథకాలు ఏమీ అమలు చేయకపోవడంతో వీటితోనే నెట్టుకువస్తున్నట్లుగా కనిపిస్తోంది. సంక్షేమ కార్యక్రమాలకు డబ్బులు లేవని చెప్తున్న ప్రభుత్వం కనీసం అభివృద్ధి మీద కూడా దృష్టి పెట్టడం లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో కనీసం సాగునీటిపై సమీక్షించిన దాఖలావు లేవు. రైతులకు అందించాల్సిన విత్తనాలపైనా దృష్టి సారించడం లేదు. అధికారులు, ప్రభుత్వం అంతా యోగాంధ్ర జపమే పఠిస్తున్నారు. ఫలాన రోజున ఎక్కడ యోగా నిర్వహించాలి, ఆ రోజు ఉదయం ఎక్కడ చాపలు పట్టుకువెళ్లాలనే పనిలోనే అధికార యంత్రాంగం తలమునకలైంది.

ఈ నెల 21 విశాఖలో నిర్వహించనున్న యోగాడేకు ప్రధాని మోడీ వస్తుండటంతో కూటమి ప్రభుత్వం ఆ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఎపిలో ఆ రోజు రికార్డు స్థాయిలో యోగా నిర్వహించి చరిత్ర పుటలకెక్కలన్నది బాబు లక్ష్యంగా ఉంది. మోడీ కళ్లలో ఆనందం కోసం బాబు, బాబు నయనాల్లో సంతోషం కోసం అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు అదే పనిలో ఉన్నారు. వీరి ఆనందం పక్కన పెడితే అధికారులు మాత్రం నలిగిపోతున్నారు. ప్రభుత్వశాఖలను, అధికారులను భాగస్వామ్యం చేస్తుండటంతో కొందరు మోహమాటానికి వెళ్తున్నారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం అన్నది నిత్యం ఎవరూ కాదని లేరు. నిత్యం క్రమం తప్పకుండా చేసే వారికి కచ్చితంగా అది మేలు చేస్తుందనటంలో సందేహం లేదు. కానీ, ఇలా రికార్డుల కోసం అలవాటు లేని వారిని తీసుకొచ్చి ఆసనాలు వేయిస్తుండటంతో పిక్కలు పట్టేయడం, ఒళ్లు నొప్పులు వంటి లేని పోని సమస్యలు కొనితెచ్చుకున్నట్లుగా ఉందంటూ కామెంట్లు వినిపిస్తున్నాయి. యోగా చేసి వచ్చిన తర్వాత అధికారులు, ఉద్యోగులు తమ రోజు వారి విధులు నిర్వహించడంలో కొంత ఇబ్బంది పడుతున్న పరిస్థితీ లేకపోలేదు. ఆరోగ్యం కోసం కొంత మంది వాకింగ్ చేస్తుంటారు. మరికొంత మంది జిమ్‌కు వెళ్తుంటారు. కొందరు షటిల్, బాడ్మింటన్ వంటి ఆటలూ ఆడుతుంటారు. వారి వయస్సు, శరీరం సహకరించిన మేరకు వివిధ రకాల వ్యాయమ పద్ధతులను ఎంచుకుంటారు. అలా కాదు అందరూ యోగా చేయాల్సిందే అంటే అధికారుల్లోనే కాదు ప్రజల్లోనూ ఏహ్యాభావం ఏర్పడుతుంది. శ్రీకాకుళం నగరంలోని కోడిరామ్మూర్తి స్టేడియాన్ని ఏళ్ల తరబడి పూర్తి చేయకుండా ఉంచేసి, అస్తవ్యస్తంగా ఉన్న పార్కులు, వాటిలో వాకింగ్ ట్రాక్‌లకు మరమ్మతులు చేయకుండా పెట్టుబడి మదుపూ లేని యోగాకు టిడిపి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడం మోడీ కళ్లలో ఆనందం కోసమే అన్న చర్చ సర్వత్రా వినిపిస్తోంది.



కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేంద్రమంత్రి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

మహిళలు అన్ని రంగాల్లో రాణించి తమ కుటుంబాలకు ఆర్థికంగా తోడు ఉండేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు ఎపి బిసి కార్పొరేషన్ ఆధ్వర్యాన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని స్థానిక సాయిరాం ఆలయంలో శనివారం ప్రారంభించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నదే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, కింజరాపు హరివరప్రసాదరావు, కళింగ వైశ్య రాష్ట్ర అధ్యక్షులు బోయిన గోవిందరాజులు, టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్ పాల్గొన్నారు.



చిన్నారితో వైద్యులు, సిబ్బంది

చిన్నారిని కాపాడిన మెడికవర్ వైద్యులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎచ్చెర్ల మండలం కుప్పిలి గ్రామానికి చెందిన 18 నెలల చిన్నారి జస్విత రెడ్డి రెండో అంతస్తు మేడపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడిపోవడంతో తీవ్ర గాయాలపాలైంది. వెంటనే చిన్నారిని శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రిలో చేర్పించగా పరిస్థితి విషమంగా ఉండగా స్పందించిన వైద్యులు ట్రామాటిక్ బ్రెయిన్ ఇంజురీతో పాటు సబ్‌డ్యూరల్ హేమరేజ్ (ఎస్‌డిహెచ్), ఎపిడ్యూరల్ హేమరేజ్ (ఇడిహెచ్), సబ్ అరక్నాయిడ్ హేమరేజ్ (ఎస్ఎహెచ్), డిఫ్యూస్ ఆక్సోనల్ ఇంజురీ (డిఎఐ) వంటి బహుళ మెదడు గాయాలు గుర్తించారు. డా. సీపాన రాజేష్, శ్రీరంగ్ నేతృత్వంలో బాల వైద్య న్యూరో క్రిటికల్ కేర్ బృందం వెంటిలేటర్‌పై ఉంచి మెదడు పనితీరును గమనించే అధునాతన పద్ధతుల్లో చికిత్స ప్రారంభించారు. 'ఇలాంటి గాయాలు చిన్నారుల్లో చాలా సంక్లిష్టమైనవని, మెదడు ఇంకా పెరుగుతున్న దశలో ఉండటం వల్ల, చిన్న పొరపాటు కూడా జీవితాంతం ప్రతికూల ప్రభావాలు చూపవచ్చునని, అత్యవసర న్యూరో మద్దతు, నిరంతర పరిశీలన, ఆధునిక బాల వైద్య చికిత్సలతో చిన్నారి స్థిరంగా ఉండగలిగిందని వైద్యులు రాజేష్ తెలిపారు. తమ వైద్య బృందం 24 గంటలు అత్యవసర సేవలను అందించడానికి సిద్ధంగా ఉందని, మెడికవర్ ఆస్పత్రిలో బాధితులకు ప్రేమ భరితమైన, నిపుణులచే మెరుగైన వైద్యం అందించడంలో ముందుంటోందన్నారు. జిల్లాలో, చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ ప్రజలకు అత్యవసర వైద్య సేవలందించడంలో తమ కృషి కొనసాగుతుందన్నారు.



పాఠశాలను సీజ్ చేస్తున్న ఎంఇఒ తులసీదాస్‌రెడ్డి

రవీంద్రభారతి పాఠశాల సీజ్

ప్రజాశక్తి - టెక్కలి

టెక్కలి పట్టణంలోని పాత జాతీయ రహదారి పక్కన ఉన్న రవీంద్ర భారతి పాఠశాలను శనివారం సీజ్ చేశామని ఎంఇఒ దల్లి తులసీరావురెడ్డి తెలిపారు. పాఠశాల నిర్వహణకు గత మూడేళ్లుగా అనుమతులు లేవని అన్నారు. దీనిపై పలు ఫిర్యాదు రావడంతో తనిఖీలు చేపట్టామని చెప్పారు. అయితే యాజమాన్యం తప్పుదోవ పట్టించిందని తెలిపారు. దీనిపై ఒక కమిటీ వేసి నివేదిక వచ్చిన తర్వాత జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు గడచిన విద్యాసంవత్సరం ముగింపులోనే సీజ్ చేయాలని సిద్ధమయ్యాయని అన్నారు. అయితే విద్యార్థుల భవిష్యత్ దృష్టా అప్పట్లో సీజ్ చేయకుండా నిలిపివేశామన్నారు. అనుమతుల కోసం అవకాశం కూడా ఇచ్చామన్నారు. కానీ, ఇప్పటి వరకు అనుమతులు తీసుకోలేదని, దీంతో పాఠశాలను సీజ్ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈయనతో పాటు కార్యాలయ సిబ్బంది రవి, సంతోష్ ఉన్నారు. కాగా, పాఠశాల సీజ్ చేయడంతో 450 మంది విద్యార్థుల భవితవ్యం ఆగమ్యగోచరంగా మారింది. 35 మంది ఉపాధ్యాయులు, సిబ్బంది పరిస్థితి కూడా అగమ్యగోచరంగా మారింది.

షైనింగ్ స్టార్ అవార్డుకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - రణస్థలం రూరల్

ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో మండలంలోని కోష్ట జంక్షన్‌లో ఉన్న శ్రీ నారాయణ పాఠశాల విద్యార్థులు ఎస్.రాజ్ కుమార్ 591 మార్కులు, కె.కృష్ణ 589 మార్కులు సాధించి షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించాలనే సత్సంకల్పంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపిక కావటంతో ప్రశంసాపత్రంతో పాటు రూ.20 వేలు నగదు, మెమెంటోను బహుమతిగా ప్రభుత్వం అందిస్తుంది. ఈ విద్యార్థులు ఈ నెల 9న జిల్లా కలెక్టర్, ఇన్‌ఛార్జి మినిస్టర్ కొండపల్లి శ్రీనివాసరావు చేతులమీదుగా ఈ అవార్డును అందుకోనున్నారని పాఠశాల డైరెక్టర్ కెల్ల మంజు భార్గవి శనివారం తెలిపారు. విద్యార్థుల ప్రతిభపై కరస్పాండెంట్ కెల్ల గోవింద, ప్రిన్సిపాల్ ఎస్.గౌరు నాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ప్రగతి విద్యార్థులకు...

నరసన్నపేట: పోలాకి మండలం పిర్యాగ్రహారంలోని ప్రగతి హైస్కూల్ విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపికయ్యారని ఎంఇఒ శ్రీనివాస్ పట్నాక్ తెలిపారు. స్థానిక ఎంఆర్‌సిలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఈ ఏడాది ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు షైనింగ్ స్టార్ అవార్డులు ఇచ్చి సత్కరిందని తెలిపారు. అందులో భాగంగా ప్రగతి హైస్కూల్ నుంచి 595/600 మార్కులు సాదించిన సనపల సత్యతేజ, 592/600 మార్కులు సాదించిన పిలక మనోజ్‌కుమార్ ఎంపికయ్యారన్నారు. వీరికి పాఠశాల డైరెక్టర్ ఇలపండ గణపతిరావు, ఉపాధ్యాయులు సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఆదిత్య విద్యార్థుల ప్రభంజనం



రేష్మా



రాజులు

ఇచ్ఛాపురం : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులు మరోసారి సత్తా చాటారని ప్రిన్సిపాల్ జీరు శేఖర్ డైరెక్టర్లు ఎస్.వి. రమణ, రాజేంద్ర ప్రసాద్, కామేష్ తెలిపారు. ఇంటర్ ప్రథమ ఎంపిసిలో గణాల రేష్మా 465/470, తిప్పిన రాజు 465/470, లిస్సా బెహరా 464/470, పత్రీ తరుణ్ 462/470, కాతిల దివ్య 461/470, బైసిపిలో నైనా వేణు 430/440, ఆసీ దివ్య 427/440, మద్ది ఆకాంక్ష 425/440 మండలంలోని అత్యుత్తమ ఫలితాలు సాధించారని అన్నారు. వీరికి అధ్యాపకులు అభినందించారు.

అంపశయ్యపై 'ఉద్దానం' ప్రాజెక్టు

- నీటి కోసం ఎదురుచూస్తున్న సీమూరు
- 11 గ్రామాలకు నిలిచిపోయిన నీటి సరఫరా

ప్రజాశక్తి - కవిటి

మండలంలోని సీమూరుకు చెందిన ప్రజలు నెల రోజులుగా ఉద్దానం నీటి కోసం ఎదురుచూస్తున్నారు. అటు అధికారులు ఇటు ప్రజాప్రతినిధులు ఎవరికి తమ సమస్య చెప్పినా నీరు మాత్రం రావడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. వాస్తవానికి నెలవంకలో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంలో భాగంగా సీమూరు వెళ్లే ఉద్దానం పైపులైన్ మరమత్తులకు గురైంది. దీనికోసం అటు ఉద్దానం ఇటు మెగా ప్రాజెక్టు సిబ్బంది మీదంటే కాదు మీదే అంటూ కొన్ని రోజులు గడిపారు. చివరకు మరమ్మతులు చేసినా సీమూరుకు మాత్రం నీటి సరఫరా జరగడం లేదు. మరోవైపు మెగా ప్రాజెక్టు చేపడుతున్న పనుల్లో భాగంగా నెలవంక పాఠశాల సమీపంలో చేసిన తప్పిదంవల్ల ఇటు బైరెడ్లపుట్టుగ అటు వడ్డిపుట్టుగ గ్రామాలకు నీరు నిలిచిపోయింది. వెరసి నెలవంక పంచాయతీలో నీటి కష్టాలు అధికమయ్యాయి.

పంపుహౌస్‌కు విద్యుత్ బంద్

కపాసుకుద్ది గ్రామంలోని ఉద్దానం పంపు హౌస్ కు గత



కాళీ బిందె చూపిస్తున్న సీమూరు మహిళలు

పది రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సుమారు 11 గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. పంపుహౌస్ సమీపంలో వ్యవసాయ పనులు చేస్తుండగా పంప్‌హౌస్‌కు వెళ్లే విద్యుత్ కనెక్షన్ తెగిపోయింది. దీంతో నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడింది. ఇది జరిగి పది రోజులు గడిచినా సంబంధిత అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించడంతో భవిష్యత్‌లో ఉద్దానం నీటి సరఫరాపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

ఇటీవల కాలంలో మండలంలో ఉద్దానం ప్రాజెక్టు పనితీరు అంపశయ్యపై ఉందని చెప్పడం ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. ముఖ్యంగా గ్రామాల్లో జరుగుతున్న జల జీవన్, మెగా పనులతో ఎక్కడపడితే అక్కడ ఉద్దానం ప్రాజెక్ట్ పైప్‌లైన్ మరమ్మతులకు గురవుతోంది. దాని మరమ్మత్తుల కోసం సంబంధిత సిబ్బందిని అడుగుతుంటే అది మాది కాదు మెగా వారిది అంటాడు ఒకడు. కాదు కాదు అది ఉద్దానం ప్రాజెక్టు పని.. మేం అందులో వేలు పెట్టకూడదంటాడు ఇంకొకడు. ఇలా ఇరువురి మధ్య సమన్వయలోపంతో మొత్తం వ్యవస్థ ఉదాసీనంగా మారుతోంది. ఉదాహరణకు మాణిక్యపురం పంపుహౌస్ పరిధిలో ఇటీవల కాలంలో ఈ విధంగానే నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నెలవంక పరిధిలో కూడా మీదంటే మీది అంటూ కాలయాపన చేశారే తప్పించి గ్రామాలకు నీటి సరఫరా జరగడం లేదనే ఆలోచనే రాకపోవడం విచారకరం. మరో విశేషం ఏమంటే మెగా ప్రాజెక్టు పనుల్లో భాగంగా జరిగిన తప్పిదానికి రెండు గ్రామాలకు నీరు నిలిచిపోయినా సంబంధిత అధికారులు స్పందించకపోవడం వారి పనితీరుకు అద్దం పడుతోంది. దీనిపై వివరణ కోసం ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇని సంప్రదిస్తే ఆయన అందుబాటులోకి రాకపోవడం విశేషం.



వడ్డిపుట్టుగలో 70 ఇళ్లకు ఇదే ఆధారం

ట్యాప్ వరకే మా బాధ్యత

గ్రామంలో ఉన్న ట్యాంకుకు నీటి సరఫరా చేసి అక్కడ నుంచి ట్యాప్ వరకు చేరేలా చేసే బాధ్యత మాత్రమే మాది. మిగతా ఏ సంబంధం మాకు లేదు. మరమ్మత్తులు, తనిఖీలు అన్నీ ఉద్దానం వారివే.

– చైతన్య, ఎఇ, మెగా ప్రాజెక్టు

కనీసం పట్టించుకోవడం లేదు



నెల రోజులుగా మాకు నీరు రావడం లేదు. మండు వేసవిలో చిన్నారులు, వృద్ధులతో నీటి కోసం అల్లాడుతున్నాం. గ్రామంలో ఒకరిద్దరి వద్ద ఉన్న విద్యుత్ మోటార్ల దగ్గరకు వెళ్లి డబ్బులు చెల్లించి నీరు తీసుకువస్తున్నాం. నీటి కోసం అష్ట కష్టాలు పడుతున్నాం. అయినా ఏ అధికారి ఎంతవరకు మా వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఇప్పటికైనా మా సమస్య పరిష్కరించి మాకు గుక్కెడు నీరు అందిస్తే అదే చాలు.

– శివంగి జ్యోతి, సీమూరు

ఒక్క కరెంటు బోరు.. 70 ఇళ్లు



గత పది రోజులుగా గ్రామంలో ఉన్న 70 ఇళ్లకు ఉన్న ఒక్క విద్యుత్ బోరే ఆధారమైంది. గత పది రోజులుగా ఉద్దానం నీరు గ్రామంలోకి రావడం లేదు. దీంతో నీటి కోసం చాలా ఇబ్బంది పడుతున్నాం. 70 ఇళ్లు ఒకే బోరుపై ఆధారపడుతుండడంతో చాలా సమస్యలు ఎదుర్కొంటున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి మా నీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నాం.

– హేమలత, వడ్డిపుట్టుగ

నెల రోజులు దాటింది



మా ఊరికి నీరొచ్చి నెల దాటింది. ఎక్కడ ఏం జరిగిందో మాకు తెలీదు. ఆడవాళ్లు నీటి కోసం చాలా ఇబ్బంది పడుతున్నారు. కనీసం భోజనం చేసిన ప్లేటు కడుక్కోవాలన్నా నీరు వృథా అవుతుందేమో అన్న పరిస్థితి ఏర్పడింది. ఇటీవల గ్రామంలో కొత్తగా పైపులైను వేసి అసంపూర్తిగా వదిలేయడంతో నీరు విడిచిపెడుతుంటే ఎక్కడికక్కడ వరద ఏర్పడుతోంది. పెద్దలు స్పందించి నీరు అందిస్తే అదే చాలు.

– ఈరోతు ఉపేంద్రరావు, సీమూరు

విత్తన ఎంపికతోనే అధిక దిగుబడులు

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

విత్తన ఎంపికతోనే అధిక దిగుబడులు సాధించవచ్చునని రాగోలు వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ మధుకుమార్ అన్నారు. శనివారం సరుబుజ్జిలి మండలంలోని చిగురువలస పంచాయతీ పరిధి కొండ్రగూడలో కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఖరీఫ్ ముందస్తు ప్రణాళికపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాగోలు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డా. మధుకుమార్ మాట్లాడుతూ ఖరీఫ్‌కు అనుకూల విత్తనాల ఎంపిక, పరిశోధన స్థానాలు తయారు చేసిన రకాలు, వాటి లక్షణాలు వివరించారు. నేలసారాన్ని అనుసరించి రకాలను ఎన్నుకున్నట్లయితే అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్త కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎరువులు, యాజమాన్యం, పచ్చిరొట్ట ఎరువులు ప్రాధాన్యాన్ని వివరించారు. నత్రజని ఎరువులతో పాటు పాస్పరస్, పొటాషియంను వాడడం ద్వారా వరి దిగుబడి బాగుంటుందని తెలిపారు. వ్యవసాయ పరిశోధనా మండలి శాస్త్రవేత్త శైలజ మాట్లాడుతూ వరిలో చీడపీడల యాజమాన్యం లింగాకర్షణ బుట్టల ప్రాధాన్యాన్ని తెలిపారు. కెవికె శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ వ్యవసాయంతో పాటు అనుబంధంగాలైన పెరటి కోళ్ల పెంపకం, పుట్టగొడుగుల పెంపకం, పశుగ్రాసాల సాగు, చేపల పెంపకం చేపట్టడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సింహాచలం, వ్యవసాయ సహాయకుడు బెనర్జీ, రాజేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బూర్జ : వరి సాగులో రైతులు చీడపీడలపై పలు జాగ్రత్తలు పాటించాలని రాజమండ్రి భారత వ్యవసాయ పరిశోధన మండలి వాణిజ్య పంటల పరిశోధనా స్థానం శాస్త్రవేత్త శైలజ అన్నారు. మండలంలోని కాలపర్తిలో కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.అనూష వరి రకాలు, అపరాలపై వివరించారు. డాక్టర్ కోటేశ్వరరావు, సహాయ అధికారి పి లక్ష్మీనారాయణ, సర్పంచ్ వరహాల నాయుడు, మాజీ సర్పంచ్ శ్రీరామమూర్తి, గోపాలరావు, కూటమి నాయకులు కులశేఖర్ దాస్, గుత్తావల్లి వ్యవసాయ సహాయాధికారి, రైతులు పాల్గొన్నారు.



ఆమదాలవలస : రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - రణస్థలం



సాయమ్మ (ఫైల్)

జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని 16వ నంబర్ జాతీయ రహదారి దన్నానపేట గ్రామ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని కమ్మసిగడాం గ్రామానికి చెందిన కోరాడ సాయమ్మ (40) మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని బండిపాలేంలో మృతురాలి బంధువుల గృహ ప్రవేశం జరిగింది. ఆ శుభ కార్యానికి వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై రమేష్, కుమారి, మృతురాలు సాయమ్మ వస్తూ రోడ్డు యూటర్న్ తీసుకుని రోడ్డు దాటుతుండగా విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. రమేష్, కుమారి సురక్షితంగా బయటపడ్డారు. సాయమ్మ ద్విచక్ర వాహనం పైనుంచి రోడ్డుపై పడిపోవడంతో లారీ టైర్లు తలపై నుంచి వెళ్లిపోవడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. మృతురాలు సాయమ్మ కమ్మసిగడాం జంక్షన్‌లో పకోడీ బండి పెట్టుకుని వ్యాపారం చేస్తుంటారు. సాయమ్మ భర్త రామ్మూర్తి శుభ కార్యాలకు వంటలు చేస్తుంటారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

ప్రజాశక్తి - లావేరు



మృతి చెందిన ఆవు

మండలంలోని గోవిందపురం పంచాయతీ ఇజ్జాడపాళెంలో శనివారం విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌తో ఆవు మృత్యువాత పడింది. గ్రామానికి చెందిన ఇజ్జాడ తిరుపతిరావుకు చెందిన ఆవు శనివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో మేత మేస్తున్న సమయంలో గ్రామానికి వెళ్తున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కేబుల్ వైర్‌కు జాయింట్ వేసి దానికి టేప్ చుట్టకుండా విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మూగజీవం బలైందని బాధిత పాడి రైతు ఆవేదన చెందాడు. పలుమార్లు విద్యుత్‌శాఖ సిబ్బందికి చెప్పినా పట్టించుకోలేదని వాపోయారు. ప్రమాదం జరిగిన తరువాత విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని, రూ.60 వేలు విలువైన ఆవు విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందినదని ఆరోపించారు. తమకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.



అభినందిస్తున్న కేంద్రమంత్రి, విప్

టిడిపి మండల అధ్యక్షునిగా కృష్ణారావు

కవిటి: కవిటి మండల టిడిపి అధ్యక్షునిగా సీనియర్ నాయకుడు, జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు పొందల కృష్ణారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం రాత్రి నిర్వహించారు. నూతన కార్యవర్గంలో మండల ఉపాధ్యక్షునిగా బడే గురుమూర్తి, ప్రధాన కార్యదర్శిగా బెందాళం తిరుమల కుమార్, కార్యనిర్వహక కార్యదర్శులుగా పి.హరిహరరావు, వై.చందు, టి. హేమదాసు, కార్యదర్శులుగా టి.మోహనరావు, మహేష్ జెన్నా, నర్తు శ్రీలక్ష్మి, కోశాధికారిగా మమత బెహరా ఎన్నికయ్యారు. వీరికి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, టిడిపి నాయకులు అభినందించారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలు

రణస్థలం రూరల్ : మండలంలోని కొండ ములగాం ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి ఎంపికైన విద్యార్థులకు ప్రవేశాలు జరుగుతున్నాయని ఎంపికైనవారంతా తగిన ధ్రువపత్రాలతో జూన్ 11లోగా ప్రవేశ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని, లేనియెడల ఆయా సీట్లు రద్దు చేయబడతాయని ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

సీటు ఖరారు చేసుకోవాలి

శ్రీకాకుళం సిటీ : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఐదవ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు సీట్లు ఖరారు చేసుకోవాలని జిల్లా కో- ఆర్డినేటర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల ఫోన్ నంబర్‌కు సమాచారం వస్తుందని, లేకుంటే సీట్లు లభించిన పాఠశాలను సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9701736862, 8331005217 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

విత్తనాల పంపిణీ

కొత్తూరు : రైతులకు ఖరీఫ్ సీజన్ మొదలు కానున్న దృష్ట్యా కురిగాం రైతు సేవా కేంద్రం ద్వారా రైతులకు సబ్సిడీపై శనివారం వరి విత్తనాలను సర్పంచ్ ఎస్.ఆశోక్ కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

తెంబూరులో అపారిశుధ్యం

పాతపట్నం: మండలంలోని తెంబూరు పంచాయతీలో దేవాంగుల వీధి నుంచి పాత పంచాయతీ కార్యాలయం వరకు వెళ్లే మార్గంలో రోడ్లపైనే చెత్త కుప్పలు పోగులుగా ఉన్నాయి. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో పాములకు, దోమలకు నిలయంగా మారింది. ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి చెత్త కుప్పలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సర్పంచ్ దేవమ్మ

వీధి దీపాలు ఏర్పాటు

నందిగాం : మండలంలోని దిమ్మిడిజాల పంచాయతీ పరిధిలో సర్పంచ్ సలానా దేవమ్మ, కార్యదర్శి సంతోష్ కుమార్ ఆధ్వర్యాన వీధుల్లో విద్యుత్ దీపాలను పునరుద్ధరించారు. పంచాయతీ పరిధిలోని బెనియావూరు, సవర రాంపురం తదితర గ్రామాల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్.కృష్ణారావు పర్యవేక్షించారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

ఆమదాలవలస : పురపాలక సంఘంలోని పలు వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా టిడిపి పని చేస్తుందని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత అన్నారు. శనివారం పురపాలక సంఘంలోని 13వ వార్డులోని విద్యానగర్‌లో తొమ్మిది లక్షలతో రహదారి, కాలువ నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టిపెట్టి ప్రతి వార్డులో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం టిడిపి ప్రధాన లక్ష్యంగా పని చేస్తుందన్నారు. పురపాలక సంఘంలోని అన్ని వార్డుల్లో కూడా ఇటువంటి అభివృద్ధి పనులు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్, టిడిపి నాయకులు కూన ఆంజనేయులు, మున్సిపల్ అధికారి పివివికె రాజు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

పశుదాణా పంపిణీ

కోటబొమ్మాళి: పాడి రైతుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు ప్రసాద్ అన్నారు. మండలంలోని నిమ్మాడలో సర్పంచ్ కింజరాపు సరేష్ అధ్యక్షతన పాడి రైతులకు పశు దాణాను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.1110లు విలువ చేసే 50 కిలోల దాణా బస్తా, లబ్ధిదారులకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై రూ.555లకే అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి ఎల్.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

బూర్జ: మండలంలోని కొల్లివలస గ్రామ కూడలి వద్ద ఎస్ఐ ప్రవళ్లిక ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలను చేపట్టారు. అధిక లోడ్లతో వెళ్తున్న ఆటోలను అలాగే లైసెన్స్ లేకుండా నడుపుతున్న ద్విచక్ర వాహనాలను తనిఖీ చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎఎస్ఐ రమణ తెలిపారు. ముఖ్యంగా మైనర్లకు వాహనాలను నడుపరాదని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని అవగాహన కల్పించారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని ఆటో డ్రైవర్లకు సూచించారు.



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

అప్పలరాజు నిరూపించాలి

ప్రజాశక్తి - పలాస

పలాస నియోజకవర్గ వ్యాపారాలతో ఎమ్మెల్యే శిరీష భర్త వెంకన్నచౌదిరికి సంబంధం ఏమిటని, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు మతిభ్రమించి ప్రతిసారీ అల్లుడి ట్యాక్స్ అనే పాట పాడుతున్నారని ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు ఎద్దేవా చేశారు. బాబూరావు స్వగృహంలో శనివారం టిడిపి నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. అల్లుడి ట్యాక్స్ వసూలు చేస్తున్నట్లు నిరూపిస్తే దేనికైనా తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఇసుక, మట్టి, కంకర, మద్యం దందాలని పదేపదే ఆరోపిస్తున్న మాజీ మంత్రి దీన్ని నిరూపించాలని సవాల్ విసిరారు. మద్యంపై రూ.పది పెంచారనేది శుద్ధ అబద్ధమని పేర్కొన్నారు. ఆదాయ పన్ను చెల్లించిన ఓ వైద్యుడిగా పేదలకు అందాల్సిన తెల్లరేషన్ కార్డు ద్వారా సరకులు తీసుకున్న దొంగచౌర ఎవరో ప్రజలకు తెలుసన్నారు. పలాసలో డంప్ చేసిన ఇసుక డబ్బులు ఎవరి ఖాతాల్లోకి వెళ్లిందని, కంకర అమ్ముకొని బోడి కొండలు చేసిన వారు ఎవరని ప్రశ్నించారు. వైసిపి పాలన ఐదేళ్లలో మాజీ మంత్రి భార్యతో పాటు ఆ నలుగురుకు పలాస ప్రజలు ట్యాక్స్ చెల్లించారని విమర్శించారు. సమావేశంలో బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, టంకాల రవిశంకరుప్త, మల్లా శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, ప్రధాన కార్యదర్శి సప్ప నవీన్ పాల్గొన్నారు.

ఐ ఎగ్జామ్ ఆర్గ్ వెబ్ ఆవిష్కరణ

కొత్తూరు: మండలంలోని బమ్మిడికి చెందిన గండెం అశోక్ ఇటీవల ఐ ఎగ్జామ్ ఆర్గ్ అనే న్యూ వెబ్ అప్లికేషన్ రూపొందించారు. దీనిని వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు చొరవతో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తన క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ అప్లికేషన్ నిరుద్యోగ యువతకు కంపెనీలకు అనుసంధానంగా రూపొందించామన్నారు. కార్యక్రమంలో గండెం అశోక్ మాట్లాడుతూ కంపెనీలు ఎగ్జామ్ నిర్వహించకుండా ఈ అప్లికేషన్ ద్వారా ఎగ్జామ్ నిర్వహించి డైరెక్టుగా కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తుందని వివరించారు. ఈ అప్లికేషన్ నిరుద్యోగ ఎంతో ఉపయోగపడుతుందని, నిరుద్యోగ యువత కోసం ఇటువంటి అప్లికేషన్ రూపొందించిన వారు శ్రీకాకుళం జిల్లాకు చెందిన వారు కావడం గర్వంగా ఉందన్నారు. ఈ యాప్‌ని రూపొందించడంలో జిల్లాకు చెందిన అశోక్‌కు సహకరించిన అతని స్నేహితులు రాజారెడ్డి, కోటి, హర్షలను అభినందించారు.



ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

ప్రజాశక్తి - కవిటి

కవిటి మండలంలో సుమారు 22 గ్రామాల ప్రజలకు ఉపయోగపడే విధంగా ఆర్‌టిసి బస్సు సదుపాయం కల్పించాలని స్వీడాప్ మాజీ చైర్మన్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి కోరారు. ఆర్‌టిసి ఇడి కె.ఎస్.బ్రహ్మానందరెడ్డికి శనివారం లేఖ రూపంలో గ్రామాల్లో రవాణా సమస్య వివరించారు. ఏయే గ్రామాలను అనుసంధానం చేయాలనే విషయాన్ని అందులో తెలిపారు. ముఖ్యంగా సోంపేట నుంచి కంచిలి మార్గంలో మంగళవారం సంత వద్ద జాతీయ రహదారి నుంచి శవసానపుట్టుగ మార్గంలో జగతి నుంచి కవిటి వరకూ సుమారు 22 గ్రామాలను అనుసంధానం చేస్తూ రాను, పోను బస్సు సదుపాయం కల్పించాలని కోరారు. దీని ద్వారా శవసానపుట్టుగ, రాపాకపుట్టుగ, ఇంటెనుక పుట్టుగ, దాసరిపుట్టుగ, కొర్రాయిపుట్టుగ, సిలగాం, కొండిపుట్టుగ, లండారిపుటుగ, కొత్తపుట్టుగ, కన్నుపుట్టుగ, జి కరాపడు, పొందూరుపుట్టుగ, ఎర్ర గోవిందపుట్టుగ, సూరిపుట్టుగ, బల్ల ఎర్రగోవిందపుట్టుగ, బింగిపుట్టుగ, గోవిందపుట్టుగ, సూరిపుట్టుగ, మెలియాపుట్టుగ, డొంకపుట్టుగ, బొన్న పుట్టుక, జగతి, కవిటి గ్రామాల ప్రజలకు, చిరు వ్యాపారులకు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు.

9న షైనింగ్ స్టార్స్‌కు అవార్డులు

శ్రీకాకుళం సిటీ: ఈ నెల 9న శ్రీకాకుళం పట్టణంలోని ఆనందమయి ఫంక్షన్ హాల్‌లో షైనింగ్ స్టార్స్‌కు అవార్డులు ప్రధానోత్సవం నిర్వహించనున్నట్లు డిఇఒ తిరుమల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి 10వ తరగతిలో 179, ఇంటర్మీడియట్‌లో 35 మంది ఉత్తమ మార్కులు సాధించారన్నారు. ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొనాలని సూచించారు. విద్యార్థులు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డు, బ్యాంక్ మొదటి పేజీ జిరాక్స్‌తో హాజరుకావాలన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ?

నరసన్నపేట: నరసన్నపేట పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ స్థలాలపై అక్రమార్కుల కన్ను పడింది. దీంతో ఇష్టానుసారంగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. శనివారం శ్రీరాం నగర్ వాసులు విలేకరులతో మాట్లాడుతూ శివారులో ఉన్న చెరువు గర్భం ప్రొక్లెయినర్‌తో చదును చేసి ఆక్రమించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ హైవేకి మధ్య ఉన్న ఖరీదైన ఈ స్థలం ఆక్రమణకు గురవుతుందని తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

టిటిడిలో నృత్య ప్రదర్శన

ఆమదాలవలస: తిరుపతి దేవస్థానంలో పట్టణానికి చెందిన నాట్యశ్రీ నృత్య కళానికేతన్ వ్యవస్థాపకులు కూన శ్రీలత శనివారం కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. నాదనీరాజనం కార్యక్రమంలో భాగంగా కూచిపూడి విశ్వవిద్యాలయం నాట్యాచార్యులు డా.చింతా రవి బాలకృష్ణ నృత్య సారథ్యంలో శ్రీలత కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. ఈ ప్రదర్శనపై పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు శ్రీలతకు అభినందనలు తెలిపారు.

ఆక్రమణలు పరిశీలన

నరసన్నపేట: నరసన్నపేట కేంద్రంలోని చెరువులు ఆక్రమణలను శ్రీకాకుళం ఆర్‌డిఒ సాయిప్రత్యూష శనివారం పరిశీలించారు. ఇందులో బాగంగా జలగల చెరువు, రాతి కర్ర చెరువుల్లో ఆక్రమణలు జోరుగా ఉన్నాయని గుర్తించారు. ఇటీవల స్థానికుడు ఈ చెరువులు ఆక్రమణలపై కోర్టుకు ఆశ్రయించారని, ఈ ఆక్రమణలపై నివేదిక తయారు చేసి ఉన్నత అధికారులకు పంపించి వారి ఆదేశాల మేరకు తొలగించే చర్యలు చేపడుతున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. తహశీల్దార్ సత్యనారాయణ పాల్గొన్నారు.

10 వరకు సేవలకు అంతరాయం

కోటబొమ్మాళి: ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ, వార్డు సచివాలయ శాఖ నిర్వహిస్తున్న ఎపి సేవా పోర్టల్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను శనివారం నుంచి ఈనెల 10 వరకు అంతరాయం కలుగుతుందని ఎంపిడిఒ కె.ఫణీంద్ర కుమార్ తెలిపారు. ఎపి సేవా పోర్టల్‌ను డేటా సెంటర్‌కి మైగ్రేషన్ చేపడుతున్నామన్నారు. దీంతో ఈ నాలుగు రోజులు అంతరాయం కలుగుతుందన్నారు. ఆదాయ ధ్రువీకరణ పత్రం, భూమి మ్యూటేషన్లు, రేషన్‌కారులు, ఇళ్ల స్థల పట్టాలు తదితర సేవలను అందించలేమన్నారు.